# తెర మీద బొమ్మ

పార్వతికి పొద్దుట లేచిన దగ్గర్నించి ఎంతో ఆనందంగా ఉంది. మహా హుషారుగా ఉంది. తరచి చూస్తే కారణమేం కనిపించటం లేదు. కానీ కాళ్ళు నేలమీద ఆనడం లేదు.

మొన్నమొన్ననే యాభై అయిదేళ్ళు నిండినా, పదహారేళ్ళ పిల్లాలా చకచకా ఇటూ అటూ తిరిగేస్తూ అంతకంటే ఏదో ఊహచేస్తూ, పనిలో వేగాన్ని పెంచేసుకుంటూ చకచకా పని చేసుకుపోతోంది.

సరిగ్గా రెండున్నర సంవత్సరాల క్రితం పార్వతి కూతురు మాధవికి పెళ్ళి కుదిరినప్పుడు, ఆ పెళ్ళి నిర్వహించేటప్పుడు పార్వతి ఇలాంటి ఒకరకమైన ఉత్సాహాన్ని పొంది, తన కర్తవ్యాన్ని గొప్పగా నిర్వర్తించానని పొంగిపోయింది. నిజమే మరి ఆ విధంగా పార్వతిని పొగడని వారంటూ లేరు.

మళ్ళీ ఇప్పుడుకొడుకు రమేశ్‌కి పెళ్ళి కుదరబోతోంది. అది ఆడపిల్ల పెళ్ళి. ఇది మగపిల్లాడి పెళ్ళి. ఆ తేడాలోనే పార్వతిలో ఉత్సాహం రెండింతలైంది.

పార్వతి చదువు సంధ్యలు లేని పల్లెటూరి మొద్దేం కాదు. సమాజంలో వస్తున్న మార్పుల గురించి, పిల్లల భవిష్యత్తుల గురించి, వారి సంపాదనల గురించి, సంప్రదాయం గురించి, పెళ్ళిళ్ళ గురించి, వాటి రాజకీయాల గురించి బాగానే తెలుసు.

సోషల్ స్టడీస్, చరిత్ర బోధించే టీచరుగా పాతిక సంవత్సరాల సర్వీసు పూర్తిచేసి, ఆడపిల్లల స్కూల్లో కొన్ని వేలమంది అమ్మాయిలకు పాఠాలు చెప్పి, ఎంతో అనుభవం గడించినట్లు తనకి తాను భావించుకునే ఆధునిక స్త్రీ పార్వతి.

స్కూల్లో నిర్వహించే డిబేట్లు, చెప్పే పాఠాలు, వేదికమీద ఉపన్యాసాలు వేరనీ,

నిజజీవితం వేరనీ తెలిసిన గడుసు మహిళ.

పార్వతి భర్త రఘునాధరావు బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్గా, ఎప్పుడూ లెక్కలలో మునిగి తేలుతూ ప్రతీది తీసివేతల గుణకారాలుగా తెలివిగా చూపించగల నేర్పరి.

ఇంతటి పార్వతికీ, ఇంతటి ఆనందంలోనూ ఒక చిన్న అనుమానం. అర్ధం కాని ప్రశ్న రాత్రినుంచి వేధిస్తోంది. అప్పుడప్పుడు దాన్ని పక్కకునెట్టేసి, తన సంబరంలో తనుందామనుకున్నా, బట్టలో ఎక్కడో దాగుండి పోయిన పూచిక ముల్లులా అది ఉండి ఉండి చురుక్కుమంటూనే ఉంది.

అది ఎంత ఆలోచించినా అంతుపట్టకుండా ఉంది. పెళ్ళయిన నాటినుంచి పార్వతి రఘునాధరావు కలిసి సంపాయించిన డబ్బును ఖర్చు చేయడం, పొదుపు చేయడం, వృద్ధి చేయడం లాంటివన్నీ రఘు చేస్తూ వచ్చాడు. అతడి వ్యాపార దృష్టికి పార్వతి తరచూ ఆశ్చర్యపోతూ, అతన్ని ఆరాధనపూర్వకంగా చూస్తుండిపోయేది. తను ఒక్కనాటికి అతనిలా ఆలోచించలేదనీ, తనకంత తెలివి లేదని పదేపదే అనుకునేది. అందుకే ఆ ఇంటి ఆర్థిక వ్యవహారాలన్నీ రఘు చేతుల మీదుగానే నడుస్తున్నాయి. ఇంతవరకు.

చిన్న కప్పులో కాఫీ పోసుకుని కూర్చుని తాగుతూ స్థిమితంగా ఆలోచనలో పడింది. ఆమె ఆలోచనలు వెనక్కి వెనక్కి వెళ్ళడం మొదలుపెట్టాయి. జరిగిపోయిన ఎన్నో సంగతులు, సంఘటనలను తలచుకుంటూ ఆ ఆ పరిస్థితుల్లో భర్త మాటలు, చేష్టలు గుర్తు తెచ్చుకుంటూ, వాటి అర్థాల్ని, భావాల్ని అందిపుచ్చుకునే ప్రయత్నంలో మునిగిపోయింది. పార్వతి.

• • •

లక్ష రూపాయల చిట్‌లో చేరి, రెండు నెలలు కట్టి, మూడో నెలే అది పాడేసి, ఆ డబ్బు పెట్టి ఒక ఇంటి స్థలం కొనేసి, ఆ స్థలం తాలూకు లే అవుట్ తీసుకొచ్చిన రోజున పార్వతి కోపంతో ఊగిపోయింది. ఎందుకంటే ఈ విషయాలన్నీ ఆమెతో మాట మాత్రంగానైనా అనకుండా చేసేసిన రఘునాధరావు, పనులన్నీ అయ్యాక కాలరెగరేశాడు.

"ఇంత డబ్బు వ్యవహారం చేస్తున్నప్పుడు నాతో ఒక్కమాట చెప్పకపోతే ఎలా?" అంటూ అరిచింది.

"ఏమిటి చెప్పేది - అయినా నేనే తప్పు పనిచేయలేదే" అని ఎదురొచ్చాడు.

"తప్పు, ఒప్పుల విషయం కాదు. నేనూ సంపాయిస్తున్నాను కదా! ఇందులో నా బాధ్యత ఉండదా?" అంటు రుసరుసలాడింది.

"ఓ యబ్బో, పెద్ద బాధ్యత. నీ బోడి సంపాదనతోనే అన్నీ జరిగిపోతున్నాయనుకోకు. అయినా నీకు వ్యవహారాలు ఏం తెలుసు? ఆ... ఏం తెలుసు? ఏదో పెద్ద మేధావిలా నాకు చెప్పలేదని అరుస్తున్నావ్" అన్నాడు.

"నేను మేధావిని అయినా కాకపోయినా ఇద్దరం సంపాయిస్తున్నప్పుడు కమిట్ మెంట్స్ గురించి ఇద్దరం కలసి ఆలోచించుకోవాలి కదా" అంది ఆయాసపడుతూ.

"ఆ.... సరే. ముందే చెప్పలేదు. అయితే ఏమిటి?"

"ఏమిటి అంటే ఏముంది".

"పోనీ అన్నీ కాన్సిల్ చేసేయ్యమంటావా? అందరిలో మా ఆవిడ నోరెట్టుకు పడిపోయింది. నేను ఆమెను గెలవలేను. ఇదిగో నా స్థలం. ఎవరికైనా అమ్మేయండి అంటూ ఆ ప్లాట్లు వేసినతనకి చెప్పేయనా?"

"అర్థం లేకుండా మాట్లాడకండి. ముందుగా నాకొక్క మాట చెప్పలేదే అంటే దానికి సమాధానం ఇదా".

"ఏమో తల్లీ, నీకు సమాధానం చెప్పేశక్తి నా కెక్కడుంది?"

"మీకు శక్తి లేకే, బాగానే వుంది. నా మీద ఆవగింజంత గౌరవం మాత్రం లేదు".

"ఏమిటి? పెద్దపెద్ద మాటలు. భార్యమీద గౌరవం ఏమిటి? అయితే రోజూ ఏమండీ పార్వతీ మేడమ్ గారూ! అంటూ వంగి సలాములు కొట్టమంటావా!" అన్నాడు హేళనగా.

ఛీ! అని మరేం మాట్లాడకుండా లోపలికెళ్ళిపోయింది. అప్పటికి పెళ్ళై నాలుగేళ్ళయ్యింది. అప్పటికి మాధవికి రెండున్నర సంవత్సరాలు.

ఈ విధంగా ఎన్నోసార్లు జరిగింది కానీ పార్వతి అప్పటికి గొడవ చేసినా తర్వాత నెమ్మదిగా మర్చిపోయేది. ఆడపడుచు చీర కొనాలంటే నాలుగొందలు పెట్టి చీర కొని, తీసుకొచ్చి ఇదిగో అనడం. నాకొక్క మాట చెప్పలేదు. నేను వద్దంటానా అని నిలదీస్తే-

"ప్రతిదానికి వక్రభాష్యాలు చెప్పకు. ఏదో అనిపించింది. చేశాను. ఏమిటీ?" అంటూ దబాయించి పారేయడం అతని స్వభావం.

ఒక్కొక్కసారి మనసెంతో విలవిల్లాడిపోయేది. ఆమె బాధంతా తనని ఒక విలువ లేని బానిసలా, డబ్బు సంపాదించి పెట్టే యంత్రంలా, ఇంట్లో పనిచేసి పెట్టి, అమర్చే నౌకర్లా, అవసరానికి సంసారం చేసే ఆడ మనిషిలా చూస్తున్నాడని చాలా బాధ పడిన సందర్భాలు వున్నాయి. కానీ అవన్నీ మర్చిపోయి, పక్కన పెట్టేసి, అతను ఆర్థికంగా ఎంత ఊర్జితం చేస్తాడో చూసి చూసి, మురిసిపోవడం నేర్చుకుంది. అందులో ఏదో ఊరట పొందడం మొదలు పెట్టింది. బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వాళ్ళు తన భర్తకున్న లౌకిక జ్ఞానం గురించి పొగుడుతుంటే పార్వతికి మహా మురిపెంగా ఉంటూ వచ్చింది. కొన్నాళ్ళకి అతని ధోరణికి చక్కని రంగులు అద్ది, లతలు దిద్ది - "మా వారు ఒక్కటీ నాకు చెప్పి చేయరు. ఆయని ధోరణే అంది. ఏ పనైనా చేశాక చెప్పడమే. అయితే ఆయనింతవరకూ తప్పుగా ఒక్క పనీ చెయ్యలేదని నేను గ్యారంటీగా చెప్పగలను" అంటూ అందరిలోను చెప్పుకుని మురిసిపోవడం పార్వతికి బాగా అలవాటైపోయింది.

ఎన్నో అత్యంత ముఖ్యవిషయాలలో తనని పక్కన పెట్టేసిన రఘునాథరావు -

మాధవి పెళ్ళి విషయంలో కాస్త వేరుగా ప్రవర్తించాడు. మొదట పిల్లాడ్ని అతడే చూశాడు. అతని చదువు, ఉద్యోగం, ఆస్థిపాస్తులు, అండదండలు అన్నీ అతనే వాకబు చేశాడు.

కానీ, కట్నం ఇచ్చే సమయంలో పార్వతికి పెద్దపీట వేశాడు. ఆమె చేత మాట్లాడించాడు.

"అమ్మో! నాకు భయం! అసలే ఇలాంటి విషయాలు నేనేం మాట్లాడగలను" అంటూ పార్వతి భయపడిపోయింది.

"ఓసి పిచ్చిదానా! కట్నాలు, కానుకలు, పెళ్ళి, పేరంటం, ముద్దు ముచ్చట్లు ఇవన్నీ ఆడవాళ్ళకి సంబంధించినవి. అవి నువ్వే మాట్లాడాలి" అని బుజ్జగించాడు.

పార్వతికి ఎక్కడలేని ఆనందం కలిగింది. ఉత్సాహంగా మాటలు కలిపి రెండు లక్షల కట్నం అన్నవాళ్ళని లక్షాయాభై వేలకి ఒప్పించి, లాంఛనాలు, చీరెలు, పెట్టుబడులు అన్నింటా బాగా పింగించి ఒబ్బిడిగా పెళ్ళి ఘనంగా చేసిన కీర్తిని రఘునాథరావుకు తెచ్చి పెట్టింది.

నాదేముందండీ, అంతా మా ఆవిడే అంటూ అందరిలో పదేపదే ప్రకటించి పార్వతి మరింత లావెక్కెలా చేశాడు.

పెళ్ళివారికి పెట్టిన వెలిసిపోయిన చీరల అపకీర్తి, అనుకున్నదానికి బంగారం అరకాసు తగ్గిందన్న తగాదా, పొద్దున్న వండిన కూరలు రాత్రి వడ్డించారనే అపనింద చాటుమాటుగా పార్వతి మీదుగా కొట్టుకుపోయాయి.

"ఆ... ఆయనేం లేదండీ! అంతా ఆవిడే. అతనొట్టి అమాయకుడే గానీ అమ్మో ఆవిడ మహాగడుసు" అంటూ చెవులు కొరుక్కుని పార్వతికి చక్కని పేరు ప్రతిష్టలను సమకూర్చిపెట్టారు బంధువర్గం.

ఇవన్నీ ఆనోటా ఈనోటా విన్నా, పార్వతికి తెలిసినా, లోకం పోకడ ఇన్నాళ్ళకి తెలుసుకుంటున్నట్లుగా గర్వపడి ఊరుకుంది.

పిల్ల,పిల్లాడికి బాగా నచ్చింది. చక్కని పిల్ల, చదువూ, సంపదా అన్నీ ఉన్నాయి. కట్నం కూడా బాగా ముట్టచెప్పేట్టుగానే వున్నారు. కొడుక్కి పిల్ల నచ్చటం బాగున్నా, ఆ విషయం వాడు వెంటనే బయటపడి పోవడం పార్వతికి కొంచెం ఇబ్బందిగా అనిపించింది.

ఈసారి రమేష్ పెళ్ళికట్నం మాట్లాడే బాధ్యత పార్వతి మీదే పెట్టాడు రఘునాథ రావు. ఎప్పటిలాగా ముందుకాస్త భయపడింది పార్వతి. మళ్ళీ అదే సమాధానం చెప్పాడు. ఇవన్నీ ఆడవాళ్ళ ముచ్చట్లు. నీకూ ఒక్కగానొక్క కొడుకు. నీ అచ్చట, ముచ్చట, వియ్యపురాలుగా తీర్చుకునే సమయం ఇదే.

వాళ్ళు రెండు లక్షలు కట్నం ఇస్తామన్నారు. కానీ వీళ్ళకి మూడు లక్షలు, లాంఛనాలు డిమాండ్ చెయ్యాలని వుంది. దానికి సారథ్యం పార్వతి.

ఇప్పుడూ పెళ్ళి మాటలు మాట్లాడేందుకు పెళ్ళికూతురు తండ్రి బాబయ్య, మావయ్యా వస్తున్నారు. వాళ్ళతో భేటీకి పార్వతి సంసిద్ధురాలైంది.

అనుకున్నట్లుగా తన మాటకారితనం ఉపయోగించి, మగపిల్లాడి తల్లిగా హోదా వెలగబెట్టి, దర్జాగా, దర్పంగా మూడు లక్షల కట్నం, లాంఛనాలకీ ఆడపిల్ల తండ్రి మెడలు వంచింది. ఎత్తలేని బరువు ఎత్తాల్సి వచ్చినందుకు ఆ పెళ్ళికూతురి తండ్రి విలవిల్లాడినా, కూతురు ఇష్టపడిందని, మోజుపడిందని తలవంచాడు. పైగా అల్లుడు కాబోయే కుర్రాడు ఇంజనీరుగా ఉన్నత స్థాయిలో ఉన్నాడు. నెలకి ముప్పై వేలు సంపాదించుకుంటున్నాడు. అందుకే ఆ తండ్రి తలవంచాడు.

పార్వతి విజయగర్వంతో ఓ పూటంతా అన్నం సయించక బాధపడింది. అనుకున్నట్లుగానే రఘునాథరావు వచ్చే కట్నం డబ్బును ఏ విధంగా వినియోగించాలో నిర్ణయించాడు. రకరకాల ఖర్చులతో, దాపరికాలతో, అన్ని సర్దుబాట్లు ముగిశాక చూస్తే, అందులో పదివేల వియ్యపురాలి కట్నం తప్ప ఆమెకేం లేదు. తను పడిన కష్టమంతా వ్యర్థమై పోయినట్లు బాధపడింది పార్వతి. అదేమాట నవ్వుతూ అన్నది కూడా.

వెంటనే రఘు–

"మనం ఏం చేసినా పిల్లల కోసం చేస్తాం గానీ మనకోసం కాదు కదా" అంటూ సమాధానమిచ్చాడు. నిజమేనని ఎంత సరిపెట్టుకుందామన్నా పార్వతికి ఏదో వెలితి, బాధ వుండనే వున్నాయి. వియ్యంకుడు గారు కట్నం పెంచేందుకు పడిన గిజగిజ గుర్తుకొచ్చినప్పుడు, పిల్ల మావయ్య చమత్కారంగా మాట్లాడుతే – స్త్రీకి స్త్రీయే శత్రువు అనే ధోరణి – జ్ఞాపకమొచ్చినప్పుడు మనసు మారుమూల కలుక్కుమంటోంది.

పెళ్ళి నిశ్చయమైంది.

నాలుగురోజులుండగా ఆడపడుచు సరళ వచ్చింది. రఘునాథరావు అక్కయ్య వీళ్ళింటికి వచ్చి పదేళ్ళయ్యింది. వాళ్ళు వుండటం ఎక్కడో రాజస్థాన్ జైపూర్‌లో వుంటారు. ఎవరి పనుల్లో వాళ్ళు వున్నారు. అప్పుడప్పుడు ఫోన్‌లో మాట్లాడుకోవడం, పలకరించు కోవడం తప్ప, చూసి చాలా కాలమైంది.

ఆరోజు సరళని చూడగానే పార్వతి మనసు ఆనందంతో ఉరకలు వేసింది. ఎప్పుడామె వచ్చినా ఇల్లంతా పండగే. మూతి విరుపులు, వ్యంగాలు, ఎత్తిపొడుపులూ వుండవు. సలహాలు, సంప్రదింపులు, వంటలో సహాయాలు, పార్వతికి ఆడపడుచు వస్తే సొంత చెల్లెలు వచ్చినదానికంటే సంబరంగా వుంటుంది. సరళకి, రఘునాథరావుకీ ఎంతో తేడా వుంది కదా! అని పార్వతి చాలా ఆశ్చర్యపోతూ వుంటుంది.

పార్వతి గలగలా మాట్లాడేస్తూ జరిగిన సంగతులన్నీ చెప్పేసింది సరళకి.

"అవునూ, కట్నం నువ్వెందుకు మాట్లాడావు వదినా!" అంది సరళ. తమ్ముడి భార్య అయినా, వదినా అని పిలవడం ఎందుకో మొదట్నించీ అలవాటు సరళకి.

"అదేమిటి సరళా! విచిత్రంగా మాట్లాడతావు. నిజానికవి ఆడాళ్ళకు చెందిన విషయాలేగా! మీ తమ్ముడు కూడా అదే అన్నారు. నిజం చెప్పొద్దు ఎన్నో విషయాలు నాకు చెప్పకుండా చేసినా, ఈ పెళ్ళిళ్ళ విషయంలో నా మాటే ఫైనల్. నేనంత చెప్తే

అంతే".

పార్వతి తన పట్టుచీరలన్నీ తీసి మడత పెట్టుకుంటూ ఆరిందాతనం ఒలకబోసింది.

"కట్నంలో నీకెంత చిక్కిందేమిటి? అది పోను డబ్బెలా ఖర్చు చేద్దామని!" అంది సరళ నెమ్మదిగా.

"నాకేం చిక్కుతుంది? ఇదేమన్నా వ్యాపారమా! ముందు వాళ్ళు చెప్పిన పదివేలు వియ్యపురాలు లాంఛనాలు నాకు. ఆ తర్వాత ఆ డబ్బును ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో అన్ని మీ తమ్ముడే ప్లాన్ చేసుకున్నారు."

"ఓహో! అయితే వట్టి బేరసారాలు చేసి పెట్టావు గానీ, పాయసంలో గరిటలా వుండిపోయావన్న మాట!" అంది అత్యంత వ్యంగ్యంగా.

పార్వతి ముఖం ఒక్కసారిగా చిన్నబోయింది. ఏదో తెలియని బాధ మనసుని పిండేసినట్లనిపించింది.

"ఎందుకమ్మా అంత వెటకారం" అంది నిష్ఠూరంగా.

"కాకపోతే ఏమిటొదినా! నీకు పెత్తనం దొరికింది కదాని ఇష్టం వచ్చినట్లు నీ తెలివితేటల్ని ఉపయోగించి కట్నం పెంచావు. దానివల్ల నువ్వు నీ సాటి మనిషి, కోడలికెంత ద్రోహం చేస్తున్నావో ఆలోచించావా? అసలు నీకెందుకు కట్నం? ఈ మగాళ్ళు ఇష్టానుసారం ఆ డబ్బు వాడుకోవడానికి నువ్వెందుకంత కష్టపడ్డావో నా కర్థం కావడం లేదు. కట్నం కోసం ప్రాణం తోడేసిందనే పేరు అత్తగారికి, దాన్ని ఉపయోగించుకునే అధికారం మామగారికి, మొగుడికీనూ, ఏం? ఆ అమ్మాయికి రేపు నీ మీద కొంచెమైనా గౌరవం ఎలా వుంటుంది? ఇన్నాళ్ళ నుంచి ఉద్యోగం చేస్తున్నావు. నలుగురిలో మసలుతున్నావు. ఈ మాత్రం తెలీకపోతే ఎలా?" సరళ కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడేసరికి పార్వతి ఒక్కసారి గాలి తీసిన బుడగలా అయిపోయింది. ఎప్పటినుంచో లోపలేదో బాధగా సలపరిస్తున్న విషయం ఒక్కసారిగా తన్నుకొచ్చినట్లయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తన్నెంత చక్కగా ఫూల్‌ని చేశాడు తన మొగుడు. తనెంత తెలివిహీనురాలై అతను చెప్పినట్లు చేసింది. సరళ ఆలోచించినట్లు తనెందుకాలోచించి లేకపోయింది? పెళ్ళికూతురు మేనమామ స్త్రీకి స్త్రీయే శత్రువు అన్నట్లు వ్యంగ్యంగా మాట్లాడిన మాటల కర్థం తెలియక అప్పుడేదో బాధ కలిగింది. ఇప్పుడా మాటలు గుర్తుకొస్తే సిగ్గుతో చచ్చిపోవాలనిపిస్తోంది. కొంతసేపు పార్వతేం మాట్లాడలేకపోయింది. సరళేం కరిగిపోలేదు.

నెమ్మదిగా పార్వతి తేరుకుని....

"ఇప్పుడేం చెయ్యను?" అంది గొంతులో ఏడుపు గరగరమంటుండగా".

"ఏం చేస్తావు? మళ్ళీ నువ్వేదైనా మాట్లాడితే పరువుపోతుంది".

"సరళా! నాకెంతో బాధగా వుంది. ఏం చెయ్యమంటావు" అంది మళ్ళీ పార్వతి.

"సరేలే, బాధపడకు. సమయం వచ్చినప్పుడు కాస్తతెలివిగా ఆలోచించి ప్రవర్తించు. ఈ మగాళ్ళు మన శక్తినీ, యుక్తినీ, మంచితనాన్ని, శరీరాన్ని, ఆలోచనని, అన్నింటినీ

వ్యాపార సరళిలో ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. మనమే తెలివిగా ప్రవర్తించాలి" అంది సరళ నెమ్మదిగా.

పెళ్ళి హడావుడి ఊపందుకుంది. సరళ అన్నింటిలోనూ సహాయం చేస్తోంది. సలహాలిస్తోంది. అదే కాకుండా సరళకీ, పార్వతికీ మధ్య ఎన్నో సంగతులు సంభాషణల్లో దొర్లుతున్నాయి. ఇంకా ఎన్నో విషయాలు చర్చల్లోకి వస్తున్నాయి. పార్వతి కొన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. కొన్ని జీర్ణం చేసుకోడానికి కష్టపడుతోంది.

ఇద్దరు ఆడవాళ్ళు ఒకే ఇంట్లో బతకాల్సి వచ్చినప్పుడు వారిద్దరి మధ్య స్నేహం, ప్రేమ, అవగాహనకు బదులుగా పోటీ, ద్వేషం, అపార్థాలు, అనుమానాలు చోటుచేసుకోవడానికి కారణాలేమై వుంటాయి అనేది పార్వతికి ఒక రీసెర్చ్ వర్క్‌గా అయిపోయింది. ప్రతీ అంశాన్ని తీవ్రంగా ఆలోచిస్తోంది. అంత హడావిడిలో, అంతమంది జనం మధ్య పార్వతి తాను ఒంటరిగానే వున్నట్లు భావించుకుంటూ వుంది.

తనూ, కోడలు ఎంతో స్నేహంగా ఒకరి ముందు ఒకరు ప్రేమగా, గౌరవంగా వుండాలి అంటే ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలన్నా పునాది వ్యతిరేకంగా పడింది. ఆ అమ్మాయి మనసులో ఇప్పటికే తనమీద ఒక అభిప్రాయం ఏర్పడి ఉంటుంది. అదే అభిప్రాయం రేపు రమేష్ మనసులోకి పాకుతుంది. వాడు తనని తల్లిగా చూడడు. మరోలా చూస్తాడు. చిరాకు పడతాడు. కానీ తనకా పరిస్థితి రాకుండా జాగ్రత్త పడాలి. అలాగని ఆమెకి పూర్తిగా దాసురాలిగా తన వ్యక్తిత్వం కోల్పోలేదు.

• • •

పార్వతిలో అంతర్మథనం క్షణక్షణం పెరిగిపోయి అశాంతి ఎక్కువైపోయింది.

పెళ్ళికూతురు మేనమామ ఆ రోజు సాయంత్రం రావడంతో టెన్త్ క్లాస్ పరీక్షకెళ్ళే పదహారేళ్ళ పసిదానిలా వణికిపోయింది.

ఆయన్ని చూడగానే తానేదో తప్పు చేసినట్లుగా గిల్టీగా అనిపించింది. అయినా సర్దుకుంది. ఎలాగైనా ఈ కట్నం గోల తప్పిపోతే బాగుండనిపిస్తోంది పార్వతికి.

"నీకేం తక్కువైందని నీకు డబ్బు పిచ్చి! ముఖ్యంగా కట్నం పిచ్చి! నువ్వు దేబిరించి సంపాదించుకున్న వియ్యపురాలి లాంఛనం పదివేల కంటే నీ నెలసరి జీతమే ఎక్కువే. ఈ లక్షల వ్యాపారాలు నీకెందుకు? నీ కొడుకు బోలెడు సంపాదిస్తున్నాడు. నీ నోట్లోంచి మాట ఊడిపడితే చాలు. ఎంత డబ్బయినా ఇస్తాడు. వాడిని బేరానికి పెట్టి నువ్వు కట్నం అడకాల్సిందేముంది?"

సరళ తనని దులిపేసిన మాటలు పార్వతికి చెవుల్లో మోగుతున్నాయి.

అయినా ఈయనిప్పుడెందుకొచ్చినట్లు అని సందేహపడుతూనే పార్వతి ఆయనకి సకల మర్యాదలూ చేసింది.

చివరకి ఆయన విషయం తేల్చాడు. అదేమంటే వాళ్ళు ముందుగా అనుకున్న కట్నం సిద్ధంగా వుందని, పైన పెంచిన లక్షా ఇంకా సర్దుబాటు కాలేదని పెళ్ళయిన

నెల్లాళ్ళకు సర్దేయగలమని నచ్చ చెప్పడానికాయన వచ్చాడు.

పార్వతి మనసు ఆనందంతో గెంతింది. పక్కన సరళ వుండటంతో మరీ ఉత్సాహంగా ఉంది.

రఘునాథరావుకి పార్వతి మనోభావాలు గానీ, సరళ చేసిన బోధలు గానీ తెలీకపోవడం వల్ల కాస్త సణుగుడు మొదలు పెట్టాడు. అందులోనూ ఇలాంటివి పార్వతికి ఇష్టముండవన్నట్లు చెప్పాడు. అంతా వింటున్న పార్వతికి మతిపోయినట్లయింది.

చివరిగా పార్వతిని లోపలికి పిలిచి, ఒప్పుకోకు మొత్తం ఒక్కసారే, ముందుగానే కావాలని చెప్పు అని హితబోధ చేశాడు. అంటూనే బయటకెళ్ళి మా ఆవిడదేనండీ పంతం; నాకేం లేదు. ఆవిడతోనే చెప్పండి అంటూ తేల్చాడు.

ఇప్పుడు నిజంగా పార్వతి కడుపు భగ్గుమని మండిపోయింది.

ఏమ్మా, ఏమంటారు? నాదీ పూచీ అన్నాడు మేనమామ. "అలాగే కానియ్యండి. మీ వీలు ప్రకారమే చెయ్యండి. మరేం ఫర్వాలేదు" అంది చటుక్కున.

రఘునాథరావు ముఖం కోపంతో జేగురు రంగులోకి మారింది. మేనమామ ముఖం ఆనందంతో, కృతజ్ఞతతో ఒకసారి ట్యూబులైటులా వెలిగింది.

రఘునాథరావు కోరగా చూశాడు భార్యవైపు. పార్వతి అతనివైపు అసలు చూడలేదు.

సరళ, పార్వతీ కళ్ళతో మాట్లాడుకున్నారు. ఆ రాత్రి రఘు చాలా ముభావంగా, కాస్తంత కోపంగానే వున్నాడు. ఆ సమయంలో రమేష్‌తో పార్వతి అయిదు నిమిషాలు మాట్లాడింది.

రమేష్ తల్లి వైపు ఆశ్చర్యంగా చూస్తూండిపోయాడు. అంతలోనే తేరుకున్నాడు. తల్లిని అభినందించాడు.

పెళ్ళికి ముందురోజు రెండు లక్షల కట్నం ఆడపెళ్ళి వారు అందచేశారు. ఆర్భాటంగా ఆ డబ్బు పార్వతే అందుకుని జాగ్రత్త చేసింది.

పెళ్ళి పందిరంతా గుప్పుమని చెప్పుకున్నారు. ఆడాళ్ళు బుగ్గలు నొక్కుకున్నారు ఆశ్చర్యంతో. మగాళ్ళు, సంగతి మింగుడు పడక మిడిగుడ్లు వేశారు. పార్వతి రెండు లక్షల రూపాయలు పళ్ళెంలో పెట్టి పెళ్ళికూతురికి కానుకగా ఇచ్చేసింది. ఒకవేళ వాళ్ళ నాన్న డబ్బేమైనా ఇస్తే అది కూతురికి చెందాలిగానీ, మొగుడికీ, అత్తకీ, మామకీ కాదని చెప్పింది.

ఎదురు తిరిగిన పార్వతిని చూసి రఘునాథరావు మతిపోయిన వాడిలా నిలబడిపోయాడు.

(వెలుగుబాట - జనవరి 2002)